తేది : 30-05-2006

ప్రచురణార్థం

# కొల్లేరులో ప్రజాభిప్రాయ సేకరణకు ఆటంకాలు కల్పించకండి
# లోక్‌సత్తా విజ్ఞప్తి

**(లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.యస్. వర్మ మే 30 వ తేదీన విడుదల చేసిన పత్రికాప్రకటన)**

కొల్లేరులో ప్రజాభిప్రాయ సేకరణ పై దాడికి పూనుకోవడం ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడం తప్ప వేరుకాదు. పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం ఇందుకోసం అనుసరిస్తున్న పద్ధతులు ఎమర్జెన్సీ కాలాన్ని తలపిస్తున్నాయి. అక్కడ ఏ పని చేసినా సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధం అనే పేరుతో యంత్రాంగం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నది.

లోక్‌సత్తా సుప్రింకోర్టు తీర్పును ధిక్కరించాల్సిందిగా పిలుపు ఇవ్వలేదు. ఎందుకంటే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు ప్రభుత్వం జారీ చేసిన జి.వో 120 ఆధారంగా వుంది. అందుచేత కొల్లేరులో వున్న 2 లక్షల మంది ప్రజల జీవితాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జి.వో 120 పై పునరాలోచన చెయ్యాలని లోక్‌సత్తా విజ్ఞప్తి చేసింది. అందుచేత కొల్లేరుపై లోక్‌సత్తా నిర్వహిస్తున్న కార్యక్రమాలు సుప్రీం తీర్పును ధిక్కరించడంగా అధికార యంత్రాంగం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అర్థరహితమని స్పష్టం చేస్తున్నాము.

**ప్రజాభిప్రాయ సేకరణ:**

కొల్లేరు వాసులు ముంపు నివారణ చర్యలకు అడ్డుపడుతున్నారని ఒకవైపున, వీరికి కొల్లేరు గత వైభవాన్ని అందిస్తామని మరోవైపున అధికార యంత్రాంగం సాగిస్తున్న ప్రచారంలో నిజానిజాలను వెలుగులోకి తేవడానికి లోక్‌సత్తా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని తలపెట్టింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా జరగడానికి వీలుగా దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ వారి సహకారాన్ని తీసుకుంది. ఈ ప్రజాభిప్రాయ సేకరణపై పశ్చిమ గోదావరి జిల్లా అధికార యంత్రాంగం రాద్ధాంతం సృష్టించడం పూర్తిగా అనుచితం. జూన్ 1,2 తేదీలలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా ప్రశాంతంగా సాగిపోవడానికి వీలుగా జిల్లా యంత్రాంగం వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాం.

**బెదిరింపులకు స్వస్తి చెప్పండి:**

మే 28 వ తేదీన ఏలూరులో జిల్లా లోక్‌సత్తా కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టడం, అభిప్రాయసేకరణ కోసం కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న నేతలను ఆర్డీవో పిలుస్తున్నారని చెప్పి పోలీసు స్టేషనుకు తరలించి అదుపులోకి తీసుకోవడం, దీనిని సుప్రీంకోర్టు వ్యతిరేక కార్యక్రమంగా కేసు నమోదు చెయ్యడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధం.

ఇంతకు ముందు కూడా ఈ జిల్లా యంత్రాంగం ఇలాంటి పద్ధతులనే అనుసరించింది. జిల్లాలో లోక్‌సత్తా కార్యకర్తల పేర్లు సేకరించడానికి ఆదేశించినట్లు ఒక వార్తను ప్రచారంలో పెట్టడం, లోక్‌సత్తా మీద బురద జల్లడానికి కొల్లేరులో లోక్‌సత్తా సభ్యుల భూముల ఆరా తీస్తున్నట్లు మరో వార్తను ప్రచారంలో పెట్టడం లాంటి చౌకబారు బెదిరింపులకు జిల్లా యంత్రాంగం పాల్పడడం విచారకరం.

కొల్లేరులో ప్రజలు, చేపల చెరువులు, పక్షులు సహజీవనం చెయ్యడానికి పూర్తిగా అవకాశాలున్నాయని ఒక దానికోసం మరో దానిని బలి పెట్టాల్సిన అవసరం లేదని లోక్‌సత్తా భావిస్తున్నది. కొల్లేరును ముంపు నుండి నివారించడానికి, మూడో కాంటూరు వరకు పక్షులకు అభయారణ్యాన్ని ఏర్పాటు చెయ్యడానికి, కొల్లేరు వాసుల జీవనాధారాన్ని

కొనసాగించడానికి, బడాబాబుల్ని తొలగించడానికి మార్గాలున్నాయని భావిస్తున్నది. ప్రభుత్వం ఒక ఆచరణాత్మకమైన దృక్పధాన్ని చేపట్టడానికి బదులు అనాలోచితంగా లక్షల ప్రజల జీవితాలను కొల్లేరుపాలు చేస్తున్నది.

**జీవించే హక్కును హరించకండి :**

ప్రజలకు వున్న జీవించే హక్కును నాశనం చేసే అధికారం ఎవరికీ లేదు. చెరువుల్ని ధ్వంసం చేసి కొల్లేరులో 2 లక్షల మందిని ఎలాంటి ఉపాధి లేకుండా మూడు, నాలుగు నెలలుగా రోడ్డున పడేశారు. వారికి పునరావాసం కల్పించాలని, అంత వరకు ఉపాధి ఏర్పాట్లు చూడాలన్న కనీస మానవతా దృక్పధాన్ని కూడా ప్రభుత్వం గాని, జిల్లా అధికార యంత్రాంగం కాని ప్రదర్శించలేదు. కొల్లేరు ప్రజలు కన్నీటితో విలపిస్తున్నారు. ఒక్కసారిగా ఛిద్రమైపోయిన జీవితాన్ని, భవిష్యత్తును తలచుకొని దుఖఃస్తున్నారు. లోక్‌సత్తా వీరికి గల జీవించే హక్కుకోసం కృషి చేస్తున్నది. ప్రజలు జీవించే హక్కుని హరించడానికి బదులు ప్రభుత్వం దానికి పరిష్కారాన్ని ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నది.

కొల్లేరు సమస్య అనేక కోణాలతో చిక్కుముళ్ళతో నిండివుంది. ఈ సమస్య పరిష్కారం కోసం ఆలోచించేవారు, ప్రయత్నిస్తున్నవారు పరస్పర ఆరోపణలకు బదులు కొల్లేటి వాసుల జీవన హక్కుకు భంగం కలగకుండా సమన్వయంతో కూడిన పరిష్కారాలను ఆలోచించాల్సిందిగా అందుకు సమిష్టిగా కృషి చేయాల్సిందిగా లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తుంది.

(డి.వి.వి.యస్. వర్మ)
లోక్‌సత్తా రాష్ట్ర ఉద్యమ సమన్వయకర్త